# కాంగ్రెస్ కండకావరం..



సాటాపూర్ గేట్ వద్ద లాఠీచార్జ్ చేస్తున్న పోలీసులు



దవాఖాన వద్ద ఆందోళన చేస్తున్న షకీల్

- బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మహ్మద్ షకీల్‌పై దాడి
- నాయకులు, కార్యకర్తలపైనా దాడులు
- పలువురికి తీవ్ర గాయాలు
- కాంగ్రెస్‌తో కుమ్మక్కైన బీజేపీ
- నన్ను ఖతం చేసేందుకే కాంగ్రెస్ నాయకుల కుట్ర
- మీడియాతో మహ్మద్ షకీల్

బోధన్, నవంబర్ 22: కాంగ్రెస్ మరోసారి అరాచకానికి దిగింది. బుధవారం ఎన్నికల ప్రచారం చేస్తున్న బోధన్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే మహ్మ ద్ షకీల్‌పై ఏకంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఇందుకు బీజేపీ నాయకులు కూడా తోడయ్యారు. అంతకుముందు బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న కార్యకర్తలపై కాంగ్రెస్, బీజేపీ నాయకులు దాడులుచేసి గాయపర్చారు. ఈ ఘటన ఎడపల్లి మండలంలోని సాటాపూర్ గేట్ వద్ద జరిగింది. ఈ ఘటనతో అక్కడ ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. రణరంగంగా మారిన సాటాపూర్ గేట్ వద్ద పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి పోలీసులు ఒక దశలో లాఠీచార్జి చేశారు. అంతకు ముందు సైతం షకీల్ ప్రచారాన్ని ఏఆర్పీ క్యాంప్, బ్రహ్మణ్‌పల్లి, జైతాపూర్ గ్రామాల్లో అడ్డుకునేందుకు కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు గొడవలు చేశారు. జైతాపూర్‌లో బీఆర్ఎస్ ఎడపల్లి మండల అధ్యక్షుడు డి.శ్రీరామ్‌పై ఆ గ్రామ కాంగ్రెస్ నాయకులు దాడి చేశారు. ఆయా గ్రామాల్లో గొడవలు సృష్టించిన కాంగ్రెస్ నాయకులు, కొందరు బీజేపీ నాయకులు సాటాపూర్ గేట్ వద్దకు చేరుకొని పథకం ప్రకారం అక్కడ ఉన్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడి చేసి పలువురిని తీవ్రంగా గాయపర్చారు. ఈలోగా అక్కడకు చేరుకున్న ఎమ్మెల్యే షకీల్ వాహనంపైనా దాడి జరిగింది. తనపై రాళ్లు, రాడ్లు, కత్తులతో కాంగ్రెస్ నాయకులు, గుండాలు దాడికి వచ్చారంటూ, తనను హత్య చేసేందుకు కుట్ర జరిగిందని షకీల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ గూండాల దాడిలో ఎడపల్లి ఉపసర్పంచ్ శ్రీనివాస్, ఎడపల్లి వైస్ ఎంపీపీ ఇమ్రాన్ ఖాన్, ఎడపల్లికి చెందిన మోసీన్, మెహబూబ్ తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని బోధన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు.

**హత్యచేసేందుకు కాంగ్రెస్ నాయకుల కుట్ర : ఎమ్మెల్యే షకీల్**

బోధన్‌లోని తన నివాసానికి చేరుకున్న షకీల్ విలేకరుల సమావేశంలో దాడి వివరాలను చెప్పారు. తనను ఒక పథకం ప్రకారం ఖతం చేయడానికి కాంగ్రెస్ నాయకులు కుట్ర పన్నారని, అదృష్టవశాత్తు ఆ కుట్ర నుంచి బయటపడ్డానని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి ఓడిపోతున్నట్లు తెలిసిపోయిందని, దీంతో నిరాశ, నిస్పృహలతో తనపై, తన అనుచరులపైనా విచక్షణారహితంగా దాడులకు ఉసిగొల్పారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకుడు శరత్‌రెడ్డి ఈ దాడికి సూత్రధారి అని అన్నారు. శరత్‌రెడ్డితో పాటు ఆయన అనుచరులు, కాంగ్రెస్ నాయకుడు శ్రీనివాస్, జైతాపూర్ సర్పంచ్ రామగోపాల్‌రెడ్డి, ఆ గ్రామానికి చెందిన నారాయణ, బోధన్‌కు చెందిన కౌన్సిలర్ మీర్ నజీర్ అలీ ఈ దాడులకు పాల్పడ్డారన్నారు. తాను సాటాపూర్ గేట్‌కు వచ్చేసరికి తమ కార్యకర్తలను, ముఖ్యంగా ముస్లిం యువకులను ఒక గదిలో బంధించి కాంగ్రె స్ నాయకులు కొట్టారన్నారు. బీజేపీ నాయకుడు కూరెళ్ల శ్రీధర్ కూడా దాడికి పాల్పడ్డవారిలో ఉన్నాడన్నారు. తనపై జరిగిన హత్యాయత్నంపై పోలీసులకు ఫిర్యాదుచేశానని షకీల్ తెలిపారు. పోలీసులు తక్షణం నిందితులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్‌చేశారు.

**బాధితులకు పరామర్శ**

బోధన్ ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్న బాధితులను షకీల్ పరామర్శించారు. ఆయన వెంట డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, గింజుపల్లి శరత్, బీఆర్ఎస్ నాయకులు బుద్దె రాజేశ్వర్, డి.శ్రీరామ్, రవీందర్ యాదవ్, బోధన్ ఏఎంసీ చైర్మన్ వెంకటేశ్వరరావు దేశాయ్ ఉన్నారు. కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి విషయాన్ని తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బోధన్ దవాఖాన వద్దకు తరలివచ్చారు.

### దాడి చేసినవారిపై కేసు నమోదు చేస్తాం

బోధన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే షకీల్ అధికారికంగా అనుమతులు పొంది ఎడపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేస్తుండగా, కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యపూరితంగా ఆయనపైనా, బీఆర్ఎస్ కార్యకర్తలపైనా దాడిచేశారని బోధన్ ఏసీపీ కిరణ్‌కుమార్ అన్నారు. బ్రాహ్మణ్‌పల్లి, జైతాపూర్ గ్రామాల్లో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ కార్యకర్తలపైన దాడులు చేసినవారిని గుర్తించి, వారిపై కేసులు నమోదు చేస్తామని ఏసీపీ తెలిపారు.

# అల్లర్లు సృష్టించడమే కాంగ్రెస్ నైజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత


- బోధన్ ఎమ్మెల్యే షకీల్‌పై దాడి హేయం..
- కాంగ్రెస్ అంటేనే కుమ్ములాటలు
- అల్లర్లు సృష్టించడం వారికి వెన్నతో పెట్టిన విద్య
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ కవిత

ఖలీల్‌వాడి, నవంబర్ 22 : రేవంత్ బెదిరింపులకు భయపడేవాళ్లెవరూ ఇక్కడ లేరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బోధన్‌లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి షకీల్, కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు చేసిన దాడిని కవిత తీవ్రంగా ఖండించారు. బుధవారం నిజామాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలకు ఐటీ రంగాన్ని విస్తరించించిందని.. కానీ కాంగ్రెస్ అల్లర్లను విస్తరిస్తూ వచ్చిందని మండిపడ్డారు. తమ పార్టీ బోధన్ అభ్యర్థి షకీల్‌పై కాంగ్రెస్ నేతలు దాడి చేశారని, జిల్లాకు వచ్చిన రేవంత్‌రెడ్డి కొంత బాధ్యతగా మాట్లాడుతారని అంతా అనుకున్నారని కానీ ఉల్టా పోలీసులను విమర్శిస్తున్నారని వివరించారు. ఇలా రౌడీయిజం, గుండాయిజాన్ని ప్రోత్సహించే వాళ్లకు పట్టం కట్టవద్దని, వారికి ఎక్కడికక్కడ నిరసనను తెలియజేయాలని పిలుపునిచ్చారు. తాము అభివృద్ధి వైపు వెళ్తుంటే వాళ్లు అరాచకం వైపు వెళ్తున్నారన్నారు. నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి ప్రజాదరణ పెరుగుతున్నదని, దాన్ని జీర్ణం చేసుకోలేక తమ పార్టీ అభ్యర్థులు, కార్యకర్తలపై భౌతిక దాడికి దిగడం చాలా హేయమైన అంశమన్నారు. రౌడీల్లా, వీధి గుండాల్లా కాపుకాసి మాటు వేసి తమ అభ్యర్థులపై దాడి చేయడం దారుణమని ఖండించారు. మొన్న దుబ్బాకలో, నిన్న మంథనిలో ఈ రోజు బోధన్‌లో జరిగిందని, కాంగ్రెస్ పార్టీ నిజ స్వరూపం, సంస్కృతి బయట పడుతున్నదని తెలిపారు. బోధన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ప్రజలకు ఏమి చేస్తారో చెప్పాలని, కానీ ఇలా గుండాయిజం, రౌడీయిజం చేయడం ఎందుకని ప్రశ్నించారు. అభద్రతాభావంతో ఉన్నారని ఆరోపించారు. ప్రజల మనసు గెలుచుకొని సీట్లు తెచ్చుకోలేక తమ అభ్యర్థిపై దాడి చేస్తే వచ్చేదేమిటని అడిగారు. పదేండ్ల కాలంలో చిన్న మతకల్లోలం లేకుండా, రౌడీలు, గుండాలు లేకుండా పరిపాలన సాగిస్తున్న సందర్భంగా రాష్ట్రానికి పెట్టుబడులు వరదలా వస్తున్నాయని చెప్పారు. ఆ పరిశ్రమల ద్వారా లక్షల సంఖ్యలో పిల్లలకు ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను పకోడీలు వేసుకోవాలని బీజేపీ పార్టీ అంటుందని, కాంగ్రెస్ పార్టీ యువతను అరాచకం వైపు తీసుకెళ్తుందని విమర్శించారు. జిల్లాలో గత ఎన్నిల్లో బీసీలకు ఇచ్చిన టికెట్లను ఈ సారి ఇతరులకు ఇచ్చి తమ పార్టీ రూరల్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌పై మాట్లాడుతున్నారని ఆక్షేపించారు. బాజిరెడ్డి ఆర్టీసీ చైర్మన్‌గా ఉన్న సమయంలోనే ఆ సంస్థను ప్రభుత్వం లో విలీనం చేశామని, ఉల్టా ఆర్టీసీ ఉద్యోగులకు అన్యాయం చేసినట్లు రేవంత్‌రెడ్డి మాట్లాడడం తగదని స్పష్టం చేశారు. ఎస్సారెస్పీని చూపించి ఓట్లు అడుగుతాం.. బీఆర్ఎస్ ఏం చూపించి ఓట్లు అడుగుతుందని రేవంత్‌రెడ్డి అన్నారని జిల్లాకు వచ్చి రేవంత్‌రెడ్డి చూడాలని, గతంలో కన్నా 3 రెట్ల ఆయకట్టు పెరిగిందని స్పష్టం చేశారు. ఆ ప్రాజెక్టును జవహర్‌లాల్ నెహ్రూ మొదలుపెడితే తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ పూర్తి చేశారని వివరించారు. ఎస్సారెస్పీ చివరి ఆయకట్టు వరకు నీళ్లు ఇస్తున్నదని సీఎం కేసీఆర్ అని కావున ఎస్సారెస్పీ గురించి మాట్లాడే అధికారం హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో ఓటు అడిగే హక్కు లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీ సీతారాం నాయక్, మేయర్ దండు నీతూకిరణ్, సీనియర్ నాయకుల అలీం, రాజారాం యాదవ్, మధు, ఖుద్దూస్ పాల్గొన్నారు.

# కళ్యాణం కమనీయం



వేడుకకు హాజరైన భక్తులు



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

- వేదమంత్రాలతో పులకించిన లింబాద్రి గుట్ట
- భారీగా తరలివచ్చిన భక్తులు

భీమ్‌గల్, నవంబర్ 22 : మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ నింబాచలంపై లక్ష్మీనారసింహుని కల్యాణంఅంగరంగ వైభవంగా సాగింది. ఈ నెల 18న ప్రారంభమైన వార్షిక కార్తీక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణ మహోత్సవాన్ని ఆలయ పండితులు కన్నుల పండువగా జరిపించారు. ఆలయ ధర్మకర్త నంబి లింబాద్రి ఆధ్వర్యంలో వేదపఠనం, నంబి పార్థసారథి, విజయ్‌సారథి, వాసుదేవాచార్యులు,విష్ణు వేదమంత్రోచ్చరణలతో కల్యాణ వేడుక ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. స్వామి వారి కల్యాణం తిలకించేందుకు భక్తులు వేల సంఖ్యలో తరలివచ్చారు. గర్భాలయంలో స్వామివారి మూల విరాట్‌కు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను బంగారు ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి మంగళవాయిద్యాలతో గర్భాలయం నుంచి పూల పల్లకీలో స్వామివారి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. ఉత్తరాదిమఠ పీఠాధిపతి 1008 సత్యాత్మ తీర్థస్వామి వారు స్వామి వారికి బహూకరించిన బంగారు తొడుగు గల శంఖంతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు. అనంతరం వేద మంత్రాలతో కన్యాదానం చేశారు. వేడుకలో రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి సతీమణి నీరజా రెడ్డి వారి కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు కన్నే ప్రేమలత–సురేందర్, కౌన్సిలర్లు , వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు. సీఐ వెంకటేశ్వర్లు అధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆటోలపై ఫిట్‌నెస్ ట్యాక్స్ రద్దు చేస్తానని సీఎం కేసీఆర్ ప్రకటించడంపై ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాన్సువాడ పట్టణంలో ఆటోడ్రైవర్లు సీఎం కేసీఆర్, స్పీకర్ పోచారం చిత్రపటాలకు బుధవారం క్షీరాభిషేకం చేశారు. తమ గురించి ఆలోచన చేసే బీఆర్ఎస్‌ను మరోసారి అధికారంలోకి తేవడానికి తమవంతు కృషి చేస్తామని ప్రకటించారు.

- బాన్సువాడ టౌన్, నవంబర్ 22